
# అమెరి'కులాసా' కథలు
## - వంగూరి చిట్టెన్ రాజు





## - 196-

### శలవులకి వెళ్ళారో- తస్మాత్ జాగ్రత్త

**మొన్నీ మధ్య చాలా ఏళ్ళ** తర్వాత పవిత్ర భారత దేశం వెళ్ళి సుమారు మూడు నెలలు గడిపి మళ్ళీ అమెరికాలో మా ఇంటికి వచ్చాక నాకు బుద్ధుడి టైపులో కొంతా, కాస్త లెవెల్ తక్కువగా చాలానూ జ్ఞానోదయం అయింది. అలా అని మా తోటలో పెద్ద బోధి వృక్షమూ, దాని కింద నేను కూచుని తపస్సు చెయ్యడాలూ వగైరాలు లేవు. ఉన్నవల్లా అప్పుడే చలికాలానికి గడ్డకట్టుకుపోయిన నాలుగు అరటి చెట్లూ, కర్వేపాకు మొక్కలే. ఆ మూడు నెలలూ అమెరికా ఇల్లు ఖాళీగానే ఉంది. భారత దేశంలో అయితే పది మంది బంధువులు, మిత్రులు ఆ నాలుగు రోజులూ ఉండేవారేమో అనుకోడానికి ఇక్కడ అంత సీను లేదు కదా. ఎవరైనా మనింటికి వచ్చి కాఫీ తాగాలి అనుకున్నా, మనం ఎవరింటికైనా వెళ్ళి పెసరెట్ తిందాం అనుకున్నా నెల ముందే ఫోన్ చేసి అనుమతి తీసుకునే దౌర్భాగ్యం మా అమెరికా దేశానిది. ఆ మాటకొస్తే మన పవిత్ర భారత దేశంలో కూడా ఈ రోజుల్లో అమెరికాలాగానే ఎవరి గోల వారిదే అనీ, పైగా ఎవరినీ నమ్మడానికి లేదు అనీ, అంతా కబ్జాల మయం అనీ కూడా విన్నాను. బహుశా అందుకే కాబోలు "మాకు విజయవాడలోనూ, హైదరాబాద్ లోనూ ఫ్లాట్స్ ఉన్నాయి కానీ...అవి తాళాలు వేసేసి పెట్టాం. అద్దెకి ఇవ్వడానికి కూడా భయంగానే ఉంది." అనే అమెరికా వారు చాలానే ఉన్నారు.

మొన్నీ మధ్య చాలా ఏళ్ళ తర్వాత పవిత్ర భారత దేశం వెళ్ళి సుమారు మూడు నెలలు గడిపి, కాకినాడలో కాస్తో, కూస్తో సాహిత్యాన్ని ఉద్ధరించేశాను అనేసుకుని అమెరికాలో మా సొంత ఇంట్లో మూడు నెలల తర్వాత అడుగుపెట్టగానే మా క్వీన్ విక్టోరియా అసంకల్పిత ప్రతీకార చర్య....కెవ్వు కేక....అది కూడా మా వంటింట్లో అడుగుపెట్టగానే!. దానికి చిన్న కారణం అక్కడ ఒకానొక పొయ్యిలో అతి చిన్న నీలం రంగు మిణుకుమిణుకు మంటున్న రంగుల మంట. అనగా మా వంటింటి నాలుగు సహజ వాయువు తో వెలిగే గేస్ కుంపట్లలో ఒకానొక చిరు కుంపటిని మూడు నెలల క్రితం వంట చేసి పారేసిన మా క్వీన్ విక్టోరియా పూర్తిగా ఆర్పివేయుట మరచెను అనే కదా అర్థం. ఈ మూడు నెలలూ ఒక బాధ్యతగల భర్తగా ఆ వాయువు తాలూకు బిల్లు కంప్యూటర్ లో ఆటో మేటిక్ గా కడుతూనే ఉండబట్టి కదా ఆ రావణ కాష్టం అలా కాలుతూనే ఉంది. "ఆ వెధవ బిల్లు అలా కట్టుకుంటూ పోకపోతే ఈ వెధవ కుంపటి ఆరిపోవును కదా" అని ఆవిడ నన్ను

చివాట్లు వెయ్యడంలో ఏమైనా ఔచిత్యం ఉందా? "ఇంకా నయం...ఇల్లంతా కాలిపోలేదు. కొంప ములిగిపోను" అని అప్పటి ఆవిడ ఉవాచ నాకు అస్సలు అర్ధం కానే లేదు. అసలు కాలిపోయే ఇల్లు నీటిలో ఎలా ములిగిపోతుందీ? మంటలలో కాలుట, నీట ములుగుట పరస్పర విరుద్ధమైన ప్రకృతి ప్రక్రియలు కదా!.

ఇక వంటింటి సంగతి మా క్వీన్ విక్టోరియా చూశాక... చలిగడ్డకట్టుకు పోయే రోజులు దాటిన తోటలోకి వెళ్ళి దాని సంగతి ఎలా ఉందో చూసే పని నాదే కదా... అనుకున్నట్టుగానే గులాబీలు నీరసంగానూ, మా అరటి చెట్లూ, కర్వేపాకూ నిర్జీవాలుగానూ, పాదులన్నీ ప్రాణాలు పోగొట్టుకునీ, మల్లె పొదలు మధ్యావస్థలోనూ ఉన్నాయి. "పరవా లేదు. నాట్ బాడ్" అనుకుంటూ మా స్ప్రింక్లర్ సిస్టమ్ ఎలా ఉందో చూద్దాం అని తోటలో అడుగుపెట్టాను. స్ప్రింక్లర్ సిస్టమ్ అనగా...మొక్కలకి నీళ్ళు పొయ్యడానికి మనకి చేతకాక, సమయం లేకా, పద్ధతి తెలియకా...ఇలా ఏదో ఒక కారణానికి తోటలో అన్ని మొక్కలకీ నీళ్ళు సకాలంలో, తగినంత సేపు చిలకరించే యంత్రాంగం మా ఇంట్లో ఎక్కడో గరాజ్ వెనకాల దాక్కుని ఉంటుంది. నీటి గొట్టాలు, నీళ్ళు వెదజల్లే పిచికారీ నాజిల్స్ భూగర్భం లో దాక్కుని ఆ యంత్రాంగం నిర్దేశించిన సమయానికి ఠకీమని ప్రాణం పోసుకుని తోట అంతా నీళ్ళు చిలకరిస్తాయి. అమెరికా చలి కాలంలో ఆరు బయట ఇలాంటి స్ప్రింక్లర్ సిస్టమ్ లో ఉన్న గొట్టాలు పగిలిపోయి మనం వరద బాధితుల కోవలోకి చేరిపోతాం. అందు చేత నేను ముందు జాగ్రత్తగానే భారత్ వెళ్ళే ముందు "ఎక్కడ గొట్టాలు ఉన్నవో అక్కడ బట్టలు చుట్టుము" అనే సిద్ధాంతాన్ని పాటించి, ఈ దిక్కుమాలిన స్ప్రింక్లర్ సిస్టమ్ నగ్నంగా ఉన్న చోటల్లా మా క్వీన్ విక్టోరియా తాలూకు పాత కాటన్ చీరలూ, దుప్పట్లూ వగైరాలు చుట్టి జాగ్రత్త పడ్డాను. .అహ...జాగ్రత్త పడ్డాను అనుకున్నాను. కానీ తోటలో అడుగుపెట్టగానే జోళ్లు బురద లోకి దిగిపోయిన ఫీలింగ్ వచ్చి...నా అసంకల్పిత ప్రతీకార చర్య గా ఆవిడ కంటే ఘాట్టిగా కెవ్వు కేక పెట్టాను. "ఓరి నాయనోయ్" అనుకుంటూ గరాజ్ వెనకాల ఉన్న స్ప్రింక్లర్ సిస్టమ్ దగ్గరకి వెళ్ళి చూడగానే ఓ పెద్ద కాగితం ముక్క దానికి వేలాడేసి ఉంది. "ఒరేయ్ నైబరూ, మొన్న చలికి ఈ దిక్కుమాలిన స్ప్రింక్లర్ తాలూకు పెద్ద గొట్టాం పగిలి చచ్చి మొత్తం నీళ్ళు కారిపోతూ ఉంటే మీ ఇంట్లోకి వచ్చే పెద్ద వాటర్ వాల్వ్ ని కట్టి పారేసి, నీటి వరద ఆపగలిగాను." అని మా పక్కింటి డేవిడ్ పెట్టిన నోట్ కనపడింది. మా డేవిడ్ మంచి బాలుడు. పాతికేళ్ళ నుంచీ మా పక్కింట్లో ఉంటూ స్నేహంగా ఉండే మంచి మనస్తత్వం ఉన్నవాడు కాబట్టి భారత్ వెళ్ళే ముందు "మా ఇల్లు కాస్త చూస్తూ ఉండు" అని మా క్వీన్ విక్టోరియా అతనికి తాళాలు ఇచ్చింది. అంత నమ్మకం పెట్టినందుకు పాపం అతను మా ఇంటి బయట అంతా బాగానే చూసుకున్నాడు కానీ లోపలికి అడుగు పెట్టలేదు. పెట్టి ఉంటే బహుశా ఆ కుంపటి మంటని ఆర్పేవాడేమో. ఆ విధంగా మా దంపతులిద్దరం రెండు నెలల భారత్ లో శలవుల తర్వాత ఇంట్లో అడుగుపెట్టగానే కెవ్వుకేకలు పెడుతూ ఆనందించాం.


చిక్కుడు, కాకర, ఆనప, దోస, పొట్ల,


దోస పాదులో..


కర్వేపాకు, బీర. దొండ



ఇప్పుడు మళ్ళీ వసంత మాసం, వేసవి కాలం రావడంతో మళ్ళీ తోటలో వ్యవసాయం మొదలుపెట్టాం. కొసమెరుపు ఏమిటంటే....కిందటి వారం ఓ రోజు మధ్యాహ్నం ఎవరో మా వీధి తలుపు తట్టారు. తీరా తలుపు తియ్యగానే... ఎంతో ఆప్యాయంగా "మన రాజు గారే కదా అని ఫోన్ చెయ్యకుండానే వచ్చేశాం. మెసేజ్ పెట్టాం కానీ మీరు చూడలేదు." అని నేను ఎప్పుడో పదేళ్ల క్రితం చికాగోలో కలుసుకున్న రచయిత్రి సుధ, శామ్యుయెల్ దంపతులు చిరునవ్వుతో కనపడ్డారు. నాకు ఇలాంటి అసంకల్పిత ఆప్యాయతలు అంటే చాలా ఇష్టం. ఇంకే ముందీ...నేనూ, మా క్వీన్ విక్టోరియా వాళ్ళతో రెండు, మూడు గంటలు గడిపేశాం. వారం, పది రోజుల్లో మా తోటలో కాసిన మొత్తం కూరగాయలు అన్నీ...అంటే దోస, బీర, దొండ, కాకర, బెండ, బచ్చలి, ఆనపకాయలే కాక రెబ్బల కొద్దీ మా ప్రపంచ ప్రఖ్యాత కర్వేపాకు..అన్నీ రెండు పెద్ద బస్తాలలో హాయిగా తమతో తీసుకెళ్ళారు. ఆ ఫొటోలు ఇక్కడ జత పరిచాను...మీ కోసం.

ఇదంతా ఇప్పుడు ఎందుకూ అంటే.....మళ్ళీ ఈ ఏడాది ఆఖర్న నవంబర్ లో మళ్ళీ భారత్ వెళ్దాం అనుకుంటున్నాం. ఈ సారి మా కొంప కాల్చే కుంపటి మీద కూడా ఒక కన్ను వేసి ఉంచమని ప్రత్యేకంగా చెప్పాలి మరి.

**COMMENTS**